సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 11 । డిసెంబర్ । 2022



ప్రభుత్వ ఉద్యోగి ఔదార్యం

- లోయలపాలెంలో అడవి బిడ్డలకు అన్నదానం
- పలువురి అభినందన

8లో



చింతూరు: మండలంలో మారుమూల గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి స్కూటీపై వెళ్లారు.



వెచ్చని నేస్తాలు

11లో

చింతపల్లి: ఏజెన్సీలో చలి తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు గిరిజనులు ఉన్ని దుస్తులు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.

న్యూస్‌రీల్

హెచ్‌ఎం భర్తపై కేసు నమోదు

రంపచోడవరం: మండలంలోని కాకవాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థినులను వేధింపులకు గురి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్‌బాబు తెలిపారు. గ్రామస్తులు, అధికారుల ఫిర్యాదు మేరకు హెచ్‌ఎం భర్త ప్రసాద్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జరిగిన సంఘటనపై ఎస్ఐ కాకవాడ పాఠశాలలో శనివారం విచారణ నిర్వహించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం అరెస్టు చేస్తామని చెప్పారు.

తెరచుకున్న చాపరాయి జలవిహారి

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో పారిశుధ్యం మెరుగు



చాపరాయి జలపాతానికి తరలివచ్చిన పర్యాటకులు

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారి తెరుచుకుంది. ఇక్కడ అపారిశుధ్యం నెలకొనడంపై గత నెల 30న కలెక్టర్ సుమిత్ కుమార్ ఆగ్రహించారు. పర్యాటకుల సందర్శనను నిలిపివేశారు. చెత్త, చెదారాలను తొలగించాలని ఆదేశించారు. ఇక్కడ పోలీసు, రెవెన్యూ నిఘాను ఏర్పాటుచేశారు. సిబ్బంది వ్యర్థాలు తొలగించారు. పరిస్థితి మెరుగుపడటంతో పర్యాటకులను అనుమతిస్తున్నారు. వీరి రాకతో సందడి వాతావరణం నెలకొంది.

వెటర్నరీ లైవ్‌స్టాక్ జూనియర్ ఆఫీసర్ల నూతన కార్యవర్గం



అప్పన్నబాబు

గంగవరం : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వెటర్నరీ లైవ్‌స్టాక్ జూనియర్ ఆఫీసర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పరిశిక అప్పన్నబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రంపచోడవరంలో జరిగిన జిల్లా నాన్ గ్రాడ్యుయేట్ల వెటర్నరీ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయనతోపాటు జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్టు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

పందెంరాయుళ్ల అరెస్టు

12 బైక్‌లు, ఆటో స్వాధీనం



అదుపులోకి తీసుకున్న పందెంరాయుళ్లతో పోలీసులు

సాక్షి, పాడేరు: మండలంలోని వంట్లమామిడి గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై శనివారం సాయంత్రం దాడులు నిర్వహించినట్టు ఎస్ఐ రంజిత్‌కుమార్ చెప్పారు. వీటిలో 9 పందెం కోళ్లతో పాటు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని ఆయన వివరించారు. అంతేకాకుండా 12 బైకులు, ఒక ఆటోను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. పందెంరాయుళ్ల నుంచి రూ.3500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

- ప్రజావేదికలో వివరాలు వెల్లడి
- ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం
- డ్వామా పీడీ రమేష్‌రామన్

8లో

గిరి గుండెల్లో వాన గుబులు

గిరి రైతుల గుండెల్లో వాన గుబులు నెలకొంది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అక్కడక్కడ కురుస్తున్న భారీ వర్షాలు అన్నదాతకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. వర్షాల నుంచి పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కోతలు పూర్తయిన పొలాల్లోని వరి పనలను సురక్షిత ప్రాంతాలకు తరలించి టార్పాలిన్లను రక్షణగా ఏర్పాటుచేసుకుంటున్నారు.

- మన్యంలో పెరుగుతున్న వర్షం తీవ్రత
- వరి పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు
- సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న రైతులు
- రక్షణగా టార్పాలిన్ల ఏర్పాటు



వరిపనలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న గిరిజన మహిళలు

సాక్షి,పాడేరు : ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంటను కాపాడుకునేందుకు గిరి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మాండాస్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో మన్యంలో వాతావరణ పరిస్థితులు బాగా మారిపోయాయి. మబ్బు వాతావరణం నెలకొంది. శుక్రవారం అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. శనివారం వర్షం ప్రభావం తగ్గింది. చిరుజల్లులకు పరిమితం కావడంతో గిరిరైతులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వరి రైతులు ఆందోళనకు చెందుతున్నారు.

దిగుబడి దశలో ఇతర పంటలు..

ఖరీఫ్‌లో వరితో పాటు, ఇతర పంటలు దిగుబడి దశకు చేరుకున్నాయి. పంటకోతలు కూడా ప్రారంభం కావడంతో పంటలను కాపాడుకునే ప్రయత్నంలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వ యంత్రాంగం,వ్యవసాయ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో గిరి రైతులు వరికోతలు నిలిపివేశారు. అయితే కోతలు పూర్తయిన పొలాల్లోని వరి పనలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వీటిని కుప్పలుగా ఏర్పాటుచేసుకుని రక్షణగా టార్పాలిన్లు, ప్లాస్టిక్ కవర్లు కప్పుతున్నారు. రాగులు, రాజ్‌మా పంటలు దిగుబడి దశకు చేరడంతో వాటిని కూడా సంరక్షించే పనిలో నిమగ్నమయ్యారు.

మారేడుమిల్లిలో అత్యధికం..

తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 75.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని కలెక్టరేట్‌లోని అధికారులు తెలిపారు. మారేడుమిల్లిలో 8.4 ఎంఎం అత్యధిక వర్షపాతం నమోదైందని వారు పేర్కొన్నారు.అనంతగిరిలో 8.2,అడ్డతీగలలో 5.8, దేవిపట్నంలో 5.8,గంగవరంలో 5.6,చింతపల్లిలో 5.6, కొయ్యూరులో 4.6,వై.రామవరంలో 4.6,పెదబయలులో 4.2,పాడేరులో 3.2, రాజవొమ్మంగిలో 2.4, వి.ఆర్.పురంలో 2.6,ముంచంగిపుట్టులో 2.2.డుంబ్రిగుడలో 2.2,జి.మాడుగులలో 2.4,జి.కె.వీధిలో 2.2,అరకులోయలో 2.0.కూనవరంలో 1.4,చింతూరులో 1.2.హుకుంపేటలో 1.0మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



మినుములూరు ప్రాంతంలో ఆరబెట్టిన వరిపనలు



కోట్లగరువు ప్రాంతంలో వరికుప్పలకు రక్షణగా కప్పిన టార్పాలిన్లు

మన్యంలో విభిన్నంగా..

- ఎత్తయిన ప్రాంతాల్లో దట్టంగా పొగమంచు
- లోతట్టు ప్రాంతాల్లో చిరు జల్లులు
- మినుములూరులో 13..
- అరకులోయలో 16..
- చింతపల్లిలో 19 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



వంజంగి హిల్స్‌పై పొంగమంచులో పర్యాటకులు

సాక్షి,పాడేరు: మాండూస్ తుపాను ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో విభిన్న వాతావరణం నెలకొంది. సముద్ర మట్టానికి నాలుగు వేల నుంచి ఐదు వేల అడుగుల ఎత్తులో ఉన్న కొండల్లో పొగమంచు దట్టంగా కురుస్తోంది. లోతట్టు ప్రాంతాల్లో వాన జల్లులు,కొన్ని చోట్ల భారీ వర్షాలు పడుతూనే ఉన్నాయి. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 13 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 16 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పాడేరు మండలం వంజంగి శిఖరాల్లో వేకువజాము నుంచి ఉదయం 9 గంటల వరకు పొగమంచు దట్టంగా కురిసింది. ప్రకృతి అందాలను చూసి పర్యాటకులు పరవశించిపోయారు. అయితే మిగిలిన పర్యాటక ప్రాంతాలలో మబ్బు వాతావరణం నెలకొంది. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈదురు గాలుల తీవ్రత నెలకొంది.

చిరుత సంచారంపై ఆందోళన వద్దు

ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కరుణాకర్



చిరుత సంచారంపై పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

గంగవరం : ఫోక్స్‌పేట ఫారెస్టు రేంజ్ పరిధిలో అటవీ ప్రాంతంలో చిరుత సంచారంపై ప్రజలు భయాందోళన చెందవలసిన అవసరం లేదని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కరుణాకర్ స్పష్టం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ పెదగార్లపాడు, గొరగొమ్మి ప్రాంతంలో చిరుత జాడలు కానరాలేదని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి పెదగార్లపాడు - గొరగొమ్మి మార్గంలో పెదగార్లపాడు శ్మశాన వాటిక సమీపంలో చిరుత సంచరించినట్లు వచ్చిన సమాచారంపై ఫారెస్టు సిబ్బంది, గిరిజన రైతులను, పశువుల కాపరులను విచారించినట్టు ఆయన వివరించారు. ఫోక్స్‌పేట, లక్కొండ రిజర్వు ఫారెస్టు ప్రాంతాల్లో అడవి జంతువుల సంచారం ఎక్కువగానే ఉందన్నారు. ఈ మధ్య కాలంలో చిరుత పాదముద్రలు గుర్తించడంతో ఆ ప్రాంతంలో రాత్రి సమయాల్లో ఏ జంతువు సంచరిస్తున్నా ప్రజలు చిరుతగానే భావిస్తున్నారని రేంజర్ అభిప్రాయపడ్డారు. చిరుత జాడ కోసం నిఘా కొనసాగుతోందని ప్రజలు భయపడాల్సిన పనిలేదని ఆయన భరోసా ఇచ్చారు.జంగమ పిల్లి , చిరుత పిల్లి, బావురుపిల్లి, పునుగుపిల్లి వంటివి కనిపించినా దానినే చిరుత పులిగా ప్రజలు భ్రమిస్తున్నారని ఆయన వివరించారు. చిరుత ఇప్పటివరకు జనావాసాల్లో ఎటువంటి దాడికి పాల్పడలేదన్నారు. ఫోక్స్‌పేట రేంజ్ పరిధిలో 34 కిలోమీటర్ల మేర అఖండిత పర్వత శ్రేణుల ద్వారా జాతీయ పార్కులకు వెళ్లేందుకు మార్గం ఉందన్నారు. ఇటీవల పోలవరం ముంపు గ్రామాలకు చెందిన నిర్వాసితులు దిగువ ప్రాంతాలకు తరలిపోవడంతో జంతువుల ఆవాసానికి విశాలత ఏర్పడటంతో వీటి ఉనికి పెరిగిందన్నారు. డీఆర్వో రాజా, ఎఫ్‌బీవోలు జగదీష్ మనోహర్, నరస్నదొర, దుర్గా శ్రీను తదితరులు రెండు బృందాలుగా ఏర్పడి గొరగొమ్మి, పెదగార్లపాడు అటవీ ప్రాంతాల్లో అన్వేషించారని చెప్పారు. అయితే చిరుతకు సంబంధించి ఏవిధమైన ఆనవాళ్లు కానరాలేదన్నారు.

ఇద్దరు రెవెన్యూ ఉద్యోగుల సస్పెన్షన్

- డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలు
- ఉత్వర్వులు జారీ చేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్
- విధుల నిర్వహణలో నిర్లక్ష్యమే కారణమని ఆయన వెల్లడి

పెదబయలు: విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చెందిన ఇద్దరు రెవెన్యూ ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో మీ సేవా, మ్యుటేషన్, పోల్‌ఆర్, రీ సర్వే, ఎలక్టోరల్ రోల్ పనుల విషయంలో డిప్యూటీ తహసీల్దార్ వి. కుమారస్వామి, సీనియర్ అసిస్టెంట్ కూడ మత్స్యరాజు నిర్లక్ష్యంగా వ్యవహరించనందున వారిని సస్పెండ్ చేశారు. ప్రభుత్వ లక్ష్యం, విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నందున సేవలందక ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని కలెక్టర్ గుర్తించారు. ఈ మేరకు చర్యలు తీసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. సస్పెండ్‌కు గురైన ఇద్దరు ఉద్యోగులు తమనుంచి ముందస్తు అనుమతి లేకుండా మండలకేంద్రం విడిచి వెళ్లకూడదని కలెక్టర్ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఇలావుండగా పెదబయలు తహసీల్దార్ ఓ.శ్రీనివాసరావు మృతి చెందిన నేపథ్యంలో హుకుంపేట డిప్యూటీ తహసీల్దార్ జె.భాస్కరరావుకు ఇన్‌చార్జి తహసీల్దారుగా నియమిస్తూ ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఆరు నెలల క్రితం పదోన్నతిపై..

పెదబయలు తహసీల్దార్‌గా ఓ.శ్రీనివాసరావు ఆరు నెలల క్రితం పదోన్నతిపై వచ్చారు. అప్పటి వరకు డీటీ కుమారస్వామి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. అయితే శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి కిందస్థాయి సిబ్బంది నుంచి సహకారం కరువైంది.ఈ నేపథ్యంలో ఆయన ఈ సమస్యను పలుసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరగడం, తోటి సిబ్బంది సహకారం కరువవడంతో తహసీల్దార్ శ్రీనివాసరావు తనలో తాను ఇబ్బంది పడేవారని తెలిసింది.

14న మెగా వైద్యశిబిరం

- అదేరోజు వాలీబాల్ టోర్నమెంట్
- చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్

సీలేరు: జిల్లాలో ఈ నెల 14న మెగా వైద్యశిబిరం, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్ తెలిపారు. గుమ్మరేవుల పంచాయితీ మాదిగ మల్లు గ్రామంలో వీటిని ఏర్పాటుచేస్తున్నట్టు ఆయన వివరించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఆయన పర్యటించారు. వీటికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధారకొండ సామాజిక భవనంలో గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ వైద్యశిబిరంలో చిన్నపిల్లలు, మహిళలు, ఎముకలు, కంటి వైద్య వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యానికి విశాఖ తరలిస్తామని చెప్పారు.

క్రీడాశక్తి పెంపొందించేందుకు వాలీబాల్ పోటీలు

యువకుల్లో క్రీడాశక్తిని పెంపొందించేందుకు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్ తెలిపారు. విజేతలకు రూ.25వేలు, 15వేలు, 10వేల నగదు బహుమతులు అందిస్తామన్నారు. పాల్గొన్న ప్రతీ వాలీబాల్ జట్టుకు కిట్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఉన్నతాధికారులు కూడా హాజరవుతారన్నారు. వీటిని విజయవంతం చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దివ్యాంగులై ఉండి సదరం సర్టిఫికెట్ కలిగి ఉంటే రాయితీపై ఆర్టీసీ బస్‌పాస్ సౌకర్యం కలిగిస్తామన్నారు. వాలీబాల్ పోటీల్లో పాల్గొనే జట్లు ముందుగా సీలేరు పోలీస్ స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికి భోజన సదుపాయం కలిగిస్తామన్నారు. జీకే వీధి సీఐ అశోక్‌కుమార్, సీలేరు ఎస్ఐ రామకృష్ణ, ధారకొండ సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

ఆ మధుర స్మృతుల్లో..

వారంతా పూర్వ విద్యార్థులు..చింతూరు జెడ్పీ పాఠశాలలో చదివిన వీరు ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. స్వర్ణోత్సవ వేడుకలకు సంకల్పించారు. వారి కలయికకు జ్ఞాపకంగా పైలాన్ ఆవిష్కరించారు. పూర్వ గురువులను ఘనంగా సత్కరించారు. విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ముందుకువచ్చారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుంటూ ఉత్సాహంగా గడపడంతో పండగ వాతావరణం నెలకొంది.



గిరిజన సంప్రదాయ పద్ధతిలో గురువులు, విద్యార్థులకు స్వాగతం



పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న పూర్వ గురువులు, విద్యార్థులు



అప్పటి గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

- స్వర్ణోత్సవ సంబరాల వేళ విద్యార్థుల అపూర్వ కలయిక
- ప్రయోజకులుగా తీర్చిదిద్దిన గురువులకు ఘన సత్కారం
- చింతూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పండగ వాతావరణం

చింతూరు: ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిసాము.. చదువులమ్మ చెట్టు నీడలో.. వియ్ ఆల్ ద ఫన్.. వియ్ ఆల్ ద జాయ్ అంటూ పూర్వ విద్యార్థులంతా తమ గురువులతో కలసి గత స్మృతులను నెమరేసుకున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాలలో 1974 నుంచి 2022 వరకు చదివిన విద్యార్థులు రెండు రోజులు నిర్వహించి తలపెట్టిన స్వర్ణోత్సవ సంబరాలు శనివారం పండగ వాతావరణంలో ప్రారంభమయ్యాయి.

తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో కలసి పాఠశాల ఆవరణలో పైలాన్‌ను ఆవిష్కరించారు. గతంలో ఇక్కడ విద్యనభ్యసించి వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థులు, గురువులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

ర్యాలీగా వెళ్లి విగ్రహాల ఆవిష్కరణ

స్థానిక శబరినది వంతెన నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. మెయిన్‌రోడ్‌లోని అల్లూరి సీతారామరాజు, ఘంటం దొర, మల్లుదొర విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన రవీంద్రనాథ్ ఠాగూర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సావిత్రిబాయి పూలే విగ్రహాలను వారు ఆవిష్కరించారు.

భవిష్యత్తును నిర్ణయించేది విద్యార్థి దశ: ఏఎస్పీ మహేశ్వరరెడ్డి

జీవితంలో విద్యార్థి దశకు ఎంతో ప్రాముఖ్యత వుందని, భవిష్యత్తును నిర్ణయించేది ఈ దశ మాత్రమేనని చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి అన్నారు. స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా జెడ్పీ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వివిధ రంగాల్లో స్థిరపడి ఎంతో పనిఒత్తిడి ఉన్నా అలనాటి స్నేహితులంతా ఒకచోటకు చేరి గత స్మృతులను పంచుకోవడం ఎంతో శుభపరిణామమని పేర్కొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన గురువులను మరవకుండా వారిని సత్కరించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ అప్పలనాయుడు, అసిస్టెంట్ ఎంఈఐ శ్వేతసాయి పాల్గొన్నారు.

గత జ్ఞాపకాలను పంచుకుంటూ..

ఎంతోకాలం క్రితం విడిపోయిన వారంతా బ్యాచ్‌ల వారీగా ఒకేచోట చేరి తాము విద్యనభ్యసించిన అలనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. దీంతోపాటు ప్రస్తుతం వారు ఎక్కడెక్కడ, ఏయే రంగాల్లో స్థిరపడ్డారు, కుటుంబాల స్థితిగతులు, పిల్లల వివరాలు ఒకరికొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దివంగత గురువులకు వారు నివాళులర్పించారు. అనంతరం బ్యాచ్‌ల వారీగా పరిచయాలు చేసుకున్నారు. ఆనందంతో పరవశించిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన పూర్వ గురువులను ఘనంగా సన్మానించారు. స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఎంతో సంతోషంగా ఉంది



గతంలో పాఠాలు బోధించిన ఇదే పాఠశాలలో తిరిగి కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది.విద్యాబుద్ధులు నేర్పిన విద్యార్థులు ప్రయోజకులు కావడం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఈ ఆనందం ఎన్నటికీ మరువలేనిది. జీవితంలో గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం

– మామిండ్లపల్లి ఆదిత్యకుమార్, ఉపాధ్యాయుడు, రాజేశ్వరపురం, ఖమ్మం జిల్లా, తెలంగాణ

గత స్మృతులు పంచుకున్నాం



ఇదే పాఠశాలలో చదువుకున్నాను. ప్రస్తుతం లాస్‌ఏంజిల్స్‌లో ఐటీ డిజైనింగ్‌లో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్నా. పూర్వ విద్యార్థులమంతా కలుసుకుని గత స్మృతులను పంచుకున్నాం. విరాళాలు వేసుకుని పాఠశాలలో మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం.

– నరహరిశెట్టి అనిల్‌కుమార్, లాస్‌ఏంజిల్స్, అమెరికా

కారు, మోటారు సైకిల్ ఢీకొని ఒకరికి గాయాలు


జడ్డంగి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు లక్ష్మణకుమార్


నుజ్జు నుజ్జు అయిన కారు ముందుభాగం

రాజవొమ్మంగి : మండలంలోని ఉర్లాకులపాడు మలుపు వద్ద శనివారం సాయంకాలం ఎదురెదురుగా వస్తున్న కారు, మోటారు సైకిల్ ఢీ కొట్టుకోవడంతో లబ్బర్తి గ్రామానికి చెందిన వంకల లక్ష్మణకుమార్ (23) తీవ్రంగా గాయపడ్డాడు. లక్ష్మణకుమార్ తన బంధువు వెంకటరమణను (22) వెంటపెట్టుకొని పల్సర్ బండిపై పెళ్లి కార్డులు పంచడానికి కాకినాడ వెళుతున్నాడు. ఇంతలో రాజానగరం నుంచి నర్సీపట్నం వైపు వెళుతున్న కారు వీరిని బలంగా ఢీకొట్టింది. అదుపు తప్పిన మోటారుసైకిల్ తుప్పల్లోకి దూసుకుపోగా గాయపడి కింద పడిపోయిన వారిని స్థానికులు జడ్డంగి పీహెచ్‌సీకు తరలించారు. మెడికల్ ఆఫీసర్ సేవసుజి ఆధ్వర్యంలో సిబ్బంది వారికి ప్రథమచికిత్స చేసారు. అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. లక్ష్మణ్‌కుమార్‌కు కుడి కాలు తొడ భాగం ఫ్రాక్చర్ అయ్యిందని డాక్టర్ సుజి తెలిపారు. ప్రమాద ఘటనలో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు



నర్సీపట్నం : వాకింగ్‌కు వెళ్లిన యువకుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ ఎస్.గణేష్ అందించిన వివరాలు...నర్సీపట్నం మున్సిపాలిటీకి చెందిన మజ్జి షద్రిక్ కుమార్(23) డిస్టెన్స్‌లో డిగ్రీ చదువుకుంటున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం తెల్లవారు జామున వాకింగ్‌కు వెళ్లాడు. అయితే ఎంతకూ షద్రిక్ కుమార్ ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంత వెతికినా కనిపించలేదు. తల్లిదండ్రులు నారాయణరావు, దేవి తమ కుమారుడు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి యువకుడి కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు


మాట్లాడుతున్న డ్వామా పీడీ రమేష్‌రామన్

గూడెంకొత్తవీధి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు పాల్పడేవారిని గుర్తించి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా డ్వామా పీడీ రమేష్‌రామన్ అన్నారు. శనివారం జీకేవీధి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. 2020-2021, 2021-2022 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు జరిగాయి. వాటిపై శనివారం బహిరంగ ప్రజావేదికలో వివరాలు వెల్లడించారు. 5,951 పనులకు రూ.40.69కోట్ల నిధులు ఖర్చుచేసినట్టు లెక్కలున్నట్టు పీడీ తెలిపారు. పనులు చేసుకుందామన్నా పథకంలో కొన్ని గ్రామాల పేర్లు కనిపించడం లేదని ఎవెన్యూ ప్లాంటేషన్ కింద నాటిన మొక్కలు కనిపించడం లేదని ఇందులో అనేక అక్రమాలు జరిగినట్టు గాలికొండ పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు ఆరోపించారు. ఉపాధి హామీ పథకంలో కొత్తరోడ్డు నిర్మించే సమయంలో మొక్కలు పోయాయని సిబ్బంది వివరించారు. పేర్లు లేకపోయినా కూలీ జనరేట్ చేసిన సీవోలకు రూ.20వేలు అపరాధ రుసుం విధించామని, ఎం.బుక్‌లో పాస్ ఆర్డర్ వేయని కారణంగా టీఏలనుంచీ 70 వేల రికవరీకి ఆదేశించామని పీడీ తెలిపారు. జిల్లా నిఘా అధికారి నిర్మలాదేవి, ఎస్ఆర్పీ సత్యనారాయణ, ఏపీఓ రామ్‌ప్రసాద్, ఎంపీపీ బోయినకుమారి, వైస్ ఎంపీపీలు ఆనందరావు, దేవుడు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వడివడిగా నూర్పిళ్లు


బొడ్లంకలో ధాన్యం సంరక్షణపై రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ సిబ్బంది


రాజవొమ్మంగిలో యంత్రాల సహాయంతో వరి నూర్పుడి చేస్తున్న రైతులు

తుపాను హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తమైన రైతులు

రాజవొమ్మంగి: మండలంలో ఇప్పటికే వరి కోతలు ముమ్మరంగా జరుగుతుండగా తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు మరింత అప్రమత్తమయ్యారు. కోసిన పంటను పొలాల్లోనే యంత్రాల సహాయంతో వడివడిగా నూర్పిళ్లు చేస్తున్నారు. రాసులుగా పోసిన ధాన్యాన్ని బస్తాల్లో ప్రభుత్వ కొనుగోలు సిబ్బందికి అప్పగిస్తున్నారు. మండలంలో శనివారం తుఫాను ప్రభావం అంతంత మాత్రంగానే కనిపించింది. చెదురు మదురు చినుకులు పడ్డాయి. ఈదురు గాలులు వీచినప్పటికి ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు.రైతులు కోతకోసిన పంటను భద్ర పరచుకొనే పనిలో నిమగ్నమయ్యారు. అందరికి ఒకేసారి పనులు రావడంతో కూలీల కొరత ఏర్పడింది. మరోవైపు మామూలు కంటే కూలి రేట్లు పెరిగాయి.

పంట సంరక్షణకు యుద్ధప్రాతిపదికన చర్యలు

అడ్డతీగల: అకాల వర్షాల కారణంగా కోతలు జరిగిన పంట పొలాల్లో పనలపై ఉన్న పంట సంరక్షణకు వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో యుద్ధ ప్రాతిపదికన చర్యలు ప్రారంభించారు.ప్రస్తుతం అడ్డతీగల మండలంలోని కోతలు ఎక్కువగా అయిన కిమ్మూరు, గొంటువానిపాలెం, వెంకటనగరం,ఎల్లవరం, కోనలోవ, వీరభద్రపురం, గొండోలు, చేనుపాకలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తూ వనలపై ఉన్న చోటల్లా ధాన్యం సేకరణకు ఇబ్బంది కలగకుండా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వరి పైరు పనల మీద తడిస్తే ఉప్పు ద్రావణంలో ఒక లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి కంకులను ముంచి ఆర బెట్టిస్తున్నారు.తడిచిన పనలను ఆర బెట్టి కుప్పలుగా వేయించి ఉప్పు పొడిని కంకులపై చల్లిస్తున్నారు. ధాన్యాన్ని సేకరించి తేమశాతాన్ని నిర్ధారణకు వ్యవసాయ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. తేమశాతం బట్టి కొనుగోలుకు ఉద్యుక్తులౌతున్నారు. అడపా దడపా వర్షం కురుస్తున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ సిబ్బంది సూచనలు తప్పని సరిగా పాటించాలని అడ్డతీగల ఏడీఏ కంకిపాటి సావిత్రి కోరుతున్నారు.


వెంకటనగరంలో తేమశాతం నిర్ధారణకు ధాన్యం సేకరిస్తున్న వ్యవసాయ సహాయకుడు శ్రీను

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ


ప్రమాదానికి గురైన బస్సును పరిశీలిస్తున్న పోలీసులు

కోటవురట్ల: మండలంలోని గొబ్బూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఆర్టీసీ గ్రామీణ బస్సు, లారీ ఢీకొన్నాయి. అయితే ప్రయాణికులు సురక్షితంగా ప్రమాదం నుంచి బయట పడ్డారు. బస్సు అద్దం, వెనుక భాగం దెబ్బతిన్నాయి. ప్రయాణికులు అందించిన వివరాల ప్రకారం.. అనకాపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ గ్రామీణ బస్సు ఎస్.రాయవరం మండలం కర్రి వానిపాలెం నుంచి విశాఖ వస్తుండగా మండలంలోని గొబ్బూరు వద్ద అదే మార్గంలో వస్తున్న లారీ పక్కగా ఢీకొంది. అయితే అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ప్రయాణికులకు ఎటువంటి హాని జరగలేదు. బస్సులో ప్రయాణిస్తున్న 54 మంది ప్రయాణికులు సురక్షితంగా ప్రమాదం నుంచి బయట పడ్డారు. అయితే బస్సు స్వల్పంగా దెబ్బతింది. వెనుక ప్రాంతంలో ఒక విండో అద్దం పగిలిపోయింది. వెనుక భాగం కాస్త దెబ్బతింది. మరో ఆర్టీసీ బస్సుతో పాటు అదే బస్సులో ప్రయాణికులను గమ్యాలకు చేర్చారు. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు.

ప్రేమించి ముఖం చాటేసిన వ్యక్తిపై మహిళ ఫిర్యాదు

మునగపాక : తనను ప్రేమించిన వ్యక్తితో వివాహం జరిపించి తగు న్యాయం చేయాలని కోరుతూ శనివారం రాత్రి వాడ్రాపల్లికి చెందిన మహిళ పోలీసులను ఆశ్రయించింది. వివరాలు ఇలా ఉన్నాయి. కుంచవానిపాలెనికి చెందిన మురళి, వాడ్రాపల్లికి చెందిన సోమేశ్వరి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకోవాలని సోమేశ్వరి కొద్దిరోజులుగా మురళిని కోరుతున్నా ఫలితం లేకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.పెళ్లి చేసుకోకపోతే ఎంతటి అఘాయిత్యానికైనా పాల్పడేందుకు వెనుకాడేది లేదని తెలిపింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగి ఔదార్యం

కొయ్యూరు: ఒక రెవెన్యూ ఉద్యోగి పేదవారి ఆకలి తీరుస్తున్నారు. నెలలో రెండుసార్లు మారుమూల గ్రామాలకు వెళ్లి అక్కడ ఉన్న వారికి భోజన సదుపాయం కల్పిస్తున్నారు. తాజాగా శనివారం బూదరాళ్ల పంచాయతీల లొయలపాలెం గ్రామంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించి 150 మందికి భోజనం అందజేశారు. మండల కేంద్రంలోని రెవెన్యూ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దుమంతి సత్యనారాయణ గత నెల నుంచి అడవి బిడ్డలకు అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. శివారు గ్రామాల్లో నెలలో రెండుసార్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి తన వంతు సాయంగా పేద గిరిజనుల ఆకలి తీరుస్తున్నట్టు చెప్పారు. వార్డు సభ్యులు సాగిన సంజీవ్,కిలో లక్ష్మణ్, దుమంతి కిరణ్,మొయిరి నరేశ్,దుంపా సతీష్ పాల్గొన్నారు.

కడుపునొప్పితో బాలిక మృతి

కోటవురట్ల : కొత్తపల్లికి చెందిన బాలిక కడుపు నొప్పితో విశాఖ కేజీహెచ్‌లో శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ ఆదినారాయణరెడ్డి తెలిపారు. సీరందాసు వాణి(15) తన తల్లి దేవితో కలిసి అచ్యుతాపురం మండలం మడుతూరులో బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లి వచ్చాక శుక్రవారం రాత్రి విపరీతమైన కడుపు నొప్పి వచ్చిందన్నారు. అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ కేజిహెచ్‌కు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. తల్లి దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- కృష్ణలంక వద్ద ప్రమాదం
- చింతపల్లికి చెందిన మహిళ మృతి


సంపూర్ణ(ఫైల్)

చింతపల్లి : విజయవాడ ప్రాంతంలోని కృష్ణలంక వద్ద జరిగిన కారు ప్రమాదంలో చింతపల్లికి చెందిన బట్టల వ్యాపారి బోగినేని సంపూర్ణ(45) మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అమలాపురంలోని కుటుంబ సభ్యుల ఇంటికి శుక్రవారం కారులో వెళ్లి వస్తుండగా కృష్ణలంక వద్ద ఆగి ఉన్న లారీని కారు బలంగా ఢీ కొట్టడంతో ఆమె సంఘటన స్థలంలో మృతి చెందినట్టు భర్త వెంకటేష్ తెలిపారు. సంపూర్ణ ప్రమాదవశాత్తూ మృతి చెందడంతో మండల కేంద్రంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వర్తక సంఘం నాయకులు బేతాళుడు, జోగేశ్వరరావు, నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. దుకాణాలు మధ్యాహ్నం వరకు మూసివేశారు.